సాక్షి
కుమురం భీం
గురువారం ׀ 21 ׀ మార్చి ׀ 2024



పత్తి పైసలు రాలె..!
సీసీఐకి పత్తి విక్రయించిన రైతుల ఖాతాల్లో నగదు జమ కావడం లేదు. నెలల తరబడి డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.
8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6.:28	శుక్ర: 4:56

గరిష్ఠం/కనిష్ఠం
34.1 /22.9

వాతావరణం
ఆకాశం చాలా వరకు నిర్మలంగా ఉంటుంది. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. తెల్లవారుజామున చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా


జిల్లెడలోని బావిని పరిశీలిస్తున్న డీఈ

పెంచికల్‌పేట్(సిర్పూర్): వేసవిలో అంతరాయం లేకుండా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ పథకం డీఈ సిద్దిఖీ తెలిపారు. మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి.. మిషన్ భగీరథ నీటి సరఫరాపై గ్రామస్తులతో మాట్లాడారు. జిల్లెడ గ్రామంలో వాల్వ్ సక్రమంగా లేకపోవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామ సమీపంలో తాగునీటి బావిని పరిశీలించి, క్లోరినేషన్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గ్రిడ్ డీఈ పృథ్వీ, మిషన్ భగీరథ ఏఈ మనోహర్, పంచాయతీ కార్యదర్శి శాంతయ్య తదితరులు ఉన్నారు.

‘ఎస్పీఎం తీరుతో ప్రజలకు ఇబ్బందులు’


అభినందన పత్రం ఇస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం యాజమాన్యం తీరుతో పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. మిల్లు ప్రారంభం నుంచి పట్టణ ప్రజలు వినియోగించుకునే దారులపై నూతన యాజమాన్యం అక్రమంగా నిర్మించిన గోడలను తొలగించిన నేపథ్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ అంజయ్య, చైర్‌పర్సన్‌ను ఐక్యవేదిక నాయకులు కలిసి అభినందన పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం చేసే ప్రతీ అభివృద్ధి పనికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు జయదేవ్, ఉపాధ్యక్షులు గొల్లపెల్లి నాగేశ్వర్‌రావు, నర్సయ్య, తాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి అంబాల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రంలో వసతులు కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు బుధవారం వినతిపత్రం అందించారు. విద్యుత్ సౌకర్యం లేని సమయంలో డయాలసిస్ చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. జెనరేటర్ వినియోగానికి డీజిల్ లేని కారణంగా రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరికాదన్నారు. పేషంట్ల నుంచి డీజిల్ ఖర్చుల కోసం సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా డయాలసిస్ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గణేష్ ఉన్నారు.

ఆన్‌లైన్ విధానంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డీజీఎం హరిశంకర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని అన్ని విభాగాల ఉద్యోగులకు బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మెడికల్, శిక్షణ వివరాల ఆన్‌లైన్ విధానంపై డీజీఎం(ఐటీ) హరిశంకర్ అవగాహన కల్పించారు. ఏరియా ఎస్వోటూజీఎం నరేందర్‌తో కలిసి ఐఎంఈ, పీఎంఈ, వీటీసీ శిక్షణ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతంలో మాదిరిగానే ఇకపై వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ ఐటీ ప్రోగ్రాం ముజీబ్, సీనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

‘బెజ్జూర్ మండలం కుంటాలమానెపల్లికి చెందిన నైతం లత్రీ కౌటాల మండలం ఇప్పలగూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో ఆర్థిక ఇబ్బందులతో ఆన్‌లైన్‌లో రుణాల కోసం ప్రయత్నించారు. ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ వ్యాపార ప్రకటనలోని లింక్ ద్వారా యూట్యూబ్‌లో ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించారు. ధనీ బ్యాంకు అధికారుల పేరుతో 9038683321 అనే నంబర్ నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. రూ.50 లక్షల రుణం మంజూరైందని, ఖాతాలో డిపాజిట్ చేస్తున్నట్లు సందేశం పంపించారు. రుణం కోసం ముందస్తుగా చార్జీలు చెల్లించాలని సూచించారు. ఆధార్, పాన్‌కార్డుతోపాటు ఆమె ఖాతా నంబర్ కలిగిన రూ.50 లక్షల ఫేక్ చెక్కును ఆమెకు వాట్సాప్ చేశారు. ఇది నమ్మి ఆమె పలు దఫాలుగా రూ.1.70 లక్షల నగదు పేటీఎం, ఫోన్‌పే ద్వారా చెల్లించారు. మరిన్ని చార్జీలు చెల్లిస్తేనే రుణం మీ ఖాతాలో జమవుతుందని సదరు వ్యక్తులు చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి, కౌటాల ఎస్సై మధుకర్, సీఐ సాధిక్ పాషాలకు ఫిర్యాదు చేశారు. వారు సైబర్ విభాగంలో ఫిర్యాదు నమోదు చేశారు. చదువుకున్న తానే మోసపోయానని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లత్రీ సూచించారు.

‘తక్కువ ధరకు కారు అమ్మబడును’ అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టిన పాపానికి తాజాగా వాంకిడి మండలం పిప్పర్‌గొంది గ్రామానికి చెందిన రాథోడ్ చంద్రకాంత్ రూ.1.43 లక్షలు మోసపోయాడు. ఈ నెల 5న తక్కువ ధరకు కారు అమ్మబడును అనే ఫేస్‌బుక్ ప్రకటనను చూసి లైక్ కొట్టాడు. వెంటనే 85798 61593 నంబరు నుంచి రామ అగర్వాల్ ఆర్మీ ఆఫీసర్ అని చెబుతూ ఫోన్ చేశారు. ఫోన్‌లో మాట్లాడిన చంద్రకాంత్ రూ.1.35 లక్షలకు కారు కొనేందుకు బేరం కుదుర్చుకున్నాడు. చార్జీల పేరిట పలు దఫాలుగా రూ.1,43,498 పంపించాడు. మళ్లీ డబ్బులు పంపించాలని కోరగా.. బాధితుడు నా వద్ద లేవని తెలపడంతో అటు వైపు నుంచి ఫోన్ కట్ అయింది. మళ్లీ ఫోన్ కలవకపోవడంతో మోసపోయానని గ్రహించి వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డిజిటల్ దొంగలు!

- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- అమాయక ప్రజలే టార్గెట్
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



జిల్లాలో సైబర్ కేసులు	సంవత్సరం	కేసులు
	2022	29
	2023	26

కౌటాల(సిర్పూర్): స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగిన తర్వాత ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయి. ఈజీ మనీకి అలవాటు కొంతమంది ఆన్‌లైన్ మోసాలే వృత్తిగా ఎంచుకుంటున్నారు. ఆన్‌లైన్ వేదికగా నేరాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర మార్గాల ద్వారా లింకులు పంపిస్తూ కొందరు ఖాతాల్లో నగదు దోచేస్తుండగా.. మరికొందరు మాయమాటలు చెప్పి తక్కువ ధరకే విలువైన వస్తువులు అంటూ బుట్టలో వేసుకుంటున్నారు. అందినకాడికి దోచుకున్న తర్వాత ఫోన్ నంబర్లు కలవకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. గ్రామీణులే కాకుండా చదువుకున్న వారు సైతం అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

అవగాహన తక్కువ..
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెండు మున్సిపాలిటీ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో జనాభా అధికంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేవలను వేగంగా అందించడంతోపాటు పారదర్శకత పెంచేందుకు ఆన్‌లైన్ సేవలు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఉపాధిహామీ పథకం, బ్యాంకింగ్, ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు పొందేందుకు ఆన్‌లైన్‌ను సంప్రదించడం ప్రతిఒక్కరికి అత్యవసరంగా మారింది. అయితే నిరక్షరాసులకు సాంకేతిక వినియోగంపై అవగాహన లేకపోవడంతో మోసాల బారిన పడుతున్నారు. ఈకేవైసీ, ఆధార్ సేవల కోసం తిర్యాణి, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లోని ఏజెన్సీ ప్రజలు ఇప్పటికీ జిల్లా కేంద్రానికి వస్తేగాని పనులు కావడం లేదు. వీరు పూర్తిగా ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులపైనే ఆధారపడతారు. అలాగే ఫోన్ వినియోగం పెరగడంతో జిల్లాలో క్రమంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. 2023 మార్చి నుంచి ఇప్పటివరకు మొత్తం 300 ఫిర్యాదులు రాగా 16 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. రుణం మంజూరైందని నమ్మించి బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకొని బాధితుల ఖాతాల్లోని సొమ్ము కాజేస్తున్నారు. అలాగే లాటరీ వచ్చిందని నగదు బహుమతి అందుకునేందుకు ఖర్చుల కింద కొంత నగదు కట్టాలంటూ మాయమాటలతో రూ.లక్షలు లాగేస్తున్నారు. పోలీసులు నిత్యం అవగాహన కల్పిస్తున్నా మోసాలకు అడ్డుకట్ట పడటం లేదు.

ఫిర్యాదు చేయొచ్చు..

సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్) ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. బాధితులు ఆలస్యం చేయకుండా వేగంగా ఫిర్యాదు చేస్తే నగదు తిరిగి పొందేందుకు ఆస్కారం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఆర్థిక మోసాలు, చిన్నారులు, మహిళలు, ఇతర సైబర్ నేరాలకు సంబంధించి వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆర్థిక మోసాలకు సంబంధించి ఫిర్యాదు చేసే సమయంలో సంబంధిత బ్యాంకు/వ్యాలెట్, లావాదేవీకి సంబంధించి 12అంకెల ఐడీ/యూటీఆర్ నంబర్, మోసం జరిగిన తేదీ, ఎంత మొత్తం, ఇందుకు అవసరమైన సాఫ్ట్‌కాపీ వివరాలు అందించాలి. https://cybercrime.gov.in లేదా 1930 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

వెంటనే ఫిర్యాదు చేయాలి



కష్టపడకుండా ఉచితంగా డబ్బులు ఎవరికీ రావు. తెలియని వ్యక్తుల ఫోన్లు, లింకులు ఓపెన్ చేయొద్దు. ముఖ్యంగా బ్యాంకుల పేరుతో వచ్చే కాల్స్‌కు ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పొద్దు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలి. మోసపోయామని గ్రహించిన వెంటనే సైబర్‌క్రైం పోలీసులకు లేదా టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో సైబర్ మోసాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

ఆదివాసీల అభివృద్ధికి పటిష్ట చర్యలు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాయని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఆసిఫాబాద్ మండలం రౌట సంకేపల్లి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తామన్నారు. పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు మల్లేశ్, ఐటీడీఏ ఏఈ నజీమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

కెరమెరి(ఆసిఫాబాద్): కోతలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు. కొన్నిరోజులుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని ఫిర్యాదు అందిన నేపథ్యంలో.. మండలంలోని ధనోరా, కెరమెరి విద్యుత్ సబ్‌స్టేషన్లను బుధవారం జీఎం గౌతంరెడ్డి, ఎస్ఈ వాసుదేవ్‌తో కలిసి పరిశీలించారు. మండలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో తరచూ అంతరాయం ఏర్పడుతుందని, త్వరలోనే అధిక వోల్టేజీతో కూడిన పీటీఆర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు ప్రత్యేక బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం లాక్‌బుక్‌ను పరిశీలించారు. వారి వెంట ఏడీ వెంకటేశ్, డీఈఈ శ్రీనివాస్, ఎల్ఐ రాజశేఖర్, ఆలమ్, జేఎల్ఎం సుదర్శన్, ఆర్టిజన్ మారుతి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులే కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులే కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మ్యాన్‌పవర్ నిర్వహణలో భాగంగా అవసరమైన సిబ్బంది నియామకం, ర్యాండమైజేషన్, ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేపట్టాలన్నారు. శిక్షణలో భాగంగా అధికారుల సామర్థ్యం పెంపుదల, శిక్షణ, వేదికల ఏర్పాట్లు, సామగ్రి పంపిణీ, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సామగ్రి ఫారాలు, బ్యాలెట్ పత్రాలు, చెరగని ఇంక్ పంపిణీ చేయాలన్నారు. రవాణా నిర్వహణలో అన్నిరకాల వాహనాలు వినియోగించుకోవాలని, కొరత ఉంటే ఇతర జిల్లాల నుంచి సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీలో భాగంగా జిల్లా వెబ్‌సైట్ నవీకరణ, సీబీటీ పనితీరు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు బలగాల కేటాయింపు, శిక్షణ, బస, రవాణా, క్లిష్టమైన పోలింగ్‌కేంద్రాల అంచనా, రక్షణ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈవీఎంల నిర్వహణలో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్ల లభ్యత, పంపిణీ, మొదటిస్థాయి తనిఖీ, ర్యాండమైజేషన్ కోసం కార్యాచరణ రూపొందించాలన్నారు. అలాగే అభ్యర్థులు, ఖర్చుల వివరాలపై ప్రతిరోజూ నివేదిక తయారు చేయాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అటవీ అభివృద్ధి


పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: అటవీశాఖకు సంబంధించిన అభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలని ఆ శాఖ అదనపు ఇన్‌స్పెక్టర్ జనరల్ కైలాస్ భీంరావు అన్నారు. ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో కంపా నిధులతో చేపట్టిన వివిధ పనులను జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అడవుల అభివృద్ధి చర్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. రేంజ్ పరిధిలో చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. రేంజ్ అధికారి అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, ఎఫ్‌బీవో రవి తదితరులు ఉన్నారు.

అక్రమ రవాణా అడ్డుకునేందుకు చర్యలు


వాహనం తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): నగదు, మద్యం, కానుకల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి బుధవారం మండలంలోని గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుతోపాటు రేపల్లెవాడ అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సరైన ఆధారాలు లేకుండా నగదు, ఇతర వస్తువులు, బంగారు ఆభరణాలు తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.87,887 విలువైన 173 లీటర్ల మద్యం, రూ.23,89,990 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే రూ.1,75,283 విలువైన 17 మిక్సర్లు, 43 కూలర్లను పట్టుకున్నామని, 1.05 కిలోల గంజాయిని సైతం సీజ్ చేశామని వెల్లడించారు. 31 మందికి బైండోవర్ చేశామన్నారు. అనంతరం వారు గంగాపూర్‌లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అపరిచితుల మాయమాటలు నమ్మొద్దన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్, ఎన్నికల కంట్రోల్ నంబర్ 08733279033కు అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడవిపై వేటు.. అనర్థమే..!

- అడవుల రక్షణ అందరి బాధ్యత
- 12శాతం పెరిగిన అటవీ విస్తీర్ణం
- నేడు ప్రపంచ అటవీ దినోత్సవం


కవ్వాల్ టైగర్‌జోన్‌లోని దట్టమైన అడవులు

జన్నారం: జీవ వైవిధ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న అడవులు నేడు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి. స్వార్థపరులు చెట్లు నరికి విక్రయిస్తుండడం, కొందరు అటవీ అధికారులు స్మగ్లింగ్‌కు సహకరిస్తుండడం అడవి మైదానంగా మారడానికి కారణం అవుతున్నాయి. పచ్చదనం కనుమరుగై వాతావరణ కాలుష్యం, వ్యాధులు, వైరస్‌లు పుట్టుకొస్తున్నాయి. అడవులు అంతరిస్తే వాతావరణ సమతుల్యత దెబ్బతిని, సూర్యుని నుంచి వెలువడే ప్రమాదకరమైన అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమిపై పడి మానవుని మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అడవులు అంతరించిపోకుండా కాపాడుకోవడం అందరి బాధ్యత. నేడు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అడవుల జిల్లా
రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అడవుల జిల్లాగా పేరుంది. 1965 నుంచి దట్టమైన అటవీ ప్రాంతంగా ప్రకటించారు. 1972లో ఈ ప్రాంతానికి వన్యప్రాణి సంరక్షణ చట్టం తీసుకొచ్చారు. 1999లో రక్షిత ప్రదేశంగా ప్రకటించారు. ఇక్కడ అడవి విస్తీర్ణం 2015.44 స్క్వేర్ కిలోమీటర్లు వ్యాపించి ఉంది. దట్టమైన అడవులు, పులుల ఆవాసాలకు అనుగుణంగా ఉండడంతో 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం 42వ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసి 893 స్క్వేర్ కిలోమీటర్లు కోర్ ఏరియా, 1123 స్క్వేర్ కిలోమీటర్లు బఫర్ ఏరియాగా ప్రకటించింది. టైగర్‌జోన్ దట్టమైన అడవులు, జంతువులు, పక్షులు, సరిసృపాల ఆవాసానికి చిరునామాగా ఉంది. టైగర్‌జోన్ అభివృద్ధికి, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి.

పెరిగిన అడవుల శాతం
గతంతో పోలిస్తే కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలో అడవుల శాతం పెరిగింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోడు వ్యవసాయం, స్మగ్లింగ్‌కు అడవులు నరికివేతకు గురయ్యాయి. దీంతో అడవుల శాతం తగ్గుతూ వచ్చింది. 2016అక్టోబర్‌కు ముందు కవ్వాల్ టైగర్‌జోన్‌లో అడవుల శాతం 21కి పడిపోయింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచడానికి హరితహారం పథకం అమలు చేసింది. టైగర్‌జోన్‌లో అటవీశాఖకు లక్ష్యాన్ని నిర్దేశించడంతో మైదాన ప్రాంతాల్లో, అడవుల్లో మొక్కలు నాటించారు. దీంతో ప్రస్తుతం టైగర్‌జోన్ ప్రాంతంలో అడవుల శాతం 21 నుంచి 33శాతానికి పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

పెరుగుతున్న స్మగ్లింగ్
ఇటీవలి సంఘటనలు పరిశీలిస్తే స్మగ్లింగ్ తిరిగి పుంజుకున్నట్లు తెలుస్తోంది. టైగర్‌జోన్ పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ రేంజ్ పరిధిలో పెద్ద ఎత్తున కలపను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫాబాద్ డివిజన్, జన్నారం, ఖానాపూర్ అటవీ డివిజన్లకు చెందిన ఆరుగురు అధికారులను సస్పెండ్ చేశారు. ఉడుంపూర్ రేంజ్, ఇందన్‌పల్లి రేంజ్ పరిధి నుంచి కలప గుట్టల పైకి తీసుకెళ్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కవ్వాల్ అటవీ సెక్షన్ నుంచి కొందరు ఫర్నిచర్ చేసే వారు నెత్తి మోతలు, ద్విచక్ర వాహనాలు, కార్ల ద్వారా కలప తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

జన్నారం ఆదర్శం
జన్నారం అటవీ డివిజన్ అడవుల రక్షణలో ఆదర్శంగా నిలుస్తోంది. టైగర్‌జోన్‌లో 14శాతం(275 స్క్వేర్ కిలో మీటర్లు) ఉన్న అడవుల రక్షణ, అభివృద్ధికి కృషి జరుగుతోంది. నూతన విధానాలతో స్మగ్లింగ్ నిరోధం, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడుతున్నారు. పశువులు, మనుషులు అడవుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. పశువుల మేత కోసం జన్నారం అటవీ డివిజన్‌లో జన్నారం రేంజ్‌లో 4.5 వేల ఎకరాలు, తాళ్లపేట రేంజ్‌లో 2 వేల ఎకరాలు, ఇందన్‌పల్లి రేంజ్‌లో 3.5 వేల ఎకరాలు కేటాయించి పశువులు అందులోనే మేపేలా చర్యలు తీసుకుంటున్నారు.

జీవవైవిధ్యంలో ముఖ్యపాత్ర

మనిషి మనుగడకు దోహదపడే అడవులు జీవవైవిధ్యంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. పక్షులు, జంతువులు, వివిధ రకాల కీటకాలకు ఆవాసాలుగా మారిన అడవులు అంతరించిపోతే అనర్థాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి. పిచ్చుకలు అంతరించిపోవడం వల్ల మిడుతలు వచ్చినట్లు కరోనా లాంటి కొత్త వైరస్‌లు పుట్టుకొస్తాయి. ప్రాణకోటికి ఆవాసంగా ఉన్న అడవుల రక్షణ అత్యంత అవసరం. అడవులు సమతుల్యత లోపిస్తే వాటిపై ఆధారపడి జీవించే వాటిపై ప్రభావం పడి అనర్థాలకు తీసే ప్రమాదం ఉంది.

అడవుల రక్షణ అందరి బాధ్యత



అడవుల రక్షణ అందరి బాధ్యత. మా వంతుగా మేము అడవులను రక్షిస్తున్నాం. విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో కాలుష్యం పెరిగే అవకాశం ఉంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం సూచించిన విధంగా అటవీ సిబ్బంది ద్వారా ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపట్టాం. – శివ్ ఆశిష్‌సింగ్, మంచిర్యాల జిల్లా అటవీ అధికారి

అనేక ఉపయోగాలు

అడవుల వల్ల అనేక ఉపయోగాలున్నాయి. స్వచ్ఛమైన వాతావరణం, స్వచ్ఛమైన ప్రాణవాయువు అడవుల వల్ల లభ్యమవుతుంది. పచ్చదనం అడవుల వల్లే సాధ్యం. అడవుల ద్వారా భూమిపై పెరుగుతున్న కాలుష్యం వల్ల అనర్థాలు రాకుండా చూసుకోవచ్చు. అడవుల రక్షణ అందరు బాధ్యతగా తీసుకోవాలి. – శాంతారాం, కన్జర్వేటర్

క్లుప్తంగా

పిడుగుపాటుతో ఏడు మేకలు మృతి..



మృతిచెందిన మేకల వద్ద బాధిత రైతులు

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్‌లో బుధవారం పిడుగుపడి ఏడు మేకలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పులిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన 4 మేకలు, తొట్ల సత్తయ్యకు చెందిన 3 మేకలు గ్రామం బయట మేతకు వెళ్లగా వర్షం కురిసే సమయంలో పిడుగుపాటుతో ఏడు మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారుగా రూ.80 వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. తమకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

రూ.5.57 లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగదుతో ఎస్సై విజయ్

వాంకిడి: ఎన్నికల నేపథ్యంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.5.57 లక్షల నగదు పట్టుబడినట్లు కెరమెరి ఎస్సై విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి సమీపంలోని టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న బస్సులో నాగ్‌పూర్‌కు చెందిన తెలాంగే లక్ష్మణ్ వద్ద రూ.4.90 లక్షలు, నాగ్‌పూర్‌కు చెందిన రక్షిత్ అనే వ్యక్తి ఆసిఫాబాద్ వైపు వస్తుండగా అతడి కారులో రూ.67 వేలు పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఎలాంటి సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్‌కు చెందిన ఓ వివాహిత కడుపునొప్పి భరించలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... గుర్రం సరోజన (48) కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించుకున్న నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భర్త రామకృష్ణ పనికి వెళ్లడంతో ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనికి వెళ్లి ఇంటికి వచ్చిన భర్త రామకృష్ణ తలుపు తట్టడంతో సరోజన ఉరేసుకుని కనిపించింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తి పైసలు రాలే..!

- నెలల తరబడి రైతుల ఎదురుచూపులు
- సీజన్ ముగిసినా అందని నగదు
- అప్పుపై వడ్డీ పెరిగిపోతోందని ఆందోళన


BELLAMPALLI MARKET YARD

ఫిబ్రవరి 13న సీసీఐకి పత్తి విక్రయించిన వివరాల తక్‌పట్టి

మంచిర్యాలఅగ్రికల్చర్: మద్దతు ధర లభిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐకి పత్తి విక్రయించిన రైతులు నెలల తరబడి డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అప్పుపై వడ్డీ పెరిగిపోతోందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వానకాలం పంటల సీజన్ ముగిసింది. మరోవైపు యాసంగి పంటలు దిగుబడి దశకు వస్తున్నాయి. అయినా మంచిర్యాల జిల్లా రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో దిగులు చెందుతున్నారు. గత వానకాలం సీజన్‌లో పత్తి సాగు చేసిన రైతులు భారీ వర్షాలతో కొంత మేర నష్టపోగా.. చీడపీడల ఉధృతితో ఆశించిన దిగుబడి రాలేదు. చేతికొచ్చిన పంట విక్రయానికి అరిగోస పడ్డారు. తేమ, నాణ్యత నిబంధనలతో కోత విధించినా ఓర్చుకున్నారు. నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం, ఫోన్‌నంబర్లు, బ్యాంకు ఖాతా బుక్ వివరాలు అందజేశారు. రైతులు, కౌలు రైతులు ఏవో నుంచి ధ్రువీకరణ పత్రాలూ సమర్పించారు.

368 మంది ఎదురుచూపులు..

మంచిర్యాల జిల్లాలో గత వానకాలం సీజన్‌లో 1.57లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. 10లక్షల టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. చెన్నూర్, బెల్లంపల్లి, లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ యార్డుల పరిధిలో ఏడు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి సేకరణ చేపట్టింది. ప్రభుత్వ మద్దతు ధర పింజ పొడవు పత్తికి క్వింటాల్‌కు రూ.7020 ఉండగా, తేమ, నాణ్యత నిబంధనలతో మద్దతు ధరలో కోత విధిస్తూ రూ.6,700 నుంచి రూ.7000 వరకు చెల్లిస్తూ కొనుగోలు చేశారు. మొత్తం 22,286 మంది రైతుల నుంచి రూ.293,92,18,539 విలువైన 4,22,240 టన్నుల పత్తి సేకరించింది. ఇప్పటివరకు 21,915 మంది రైతులకు రూ.286,56,79,412 నగదు ఖాతాల్లో జమ చేసింది. ఇంకా 368 మంది రైతులకు రూ.7,33,39,122 నగదు జమ చేయాల్సి ఉంది. డిసెంబర్‌లో పత్తి విక్రయించిన రైతులకు ఇప్పటికీ నగదు అందకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1618మంది పత్తి రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే నిర్మల్ జిల్లాలో 115 మందికి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 641మందికి, ఆదిలాబాద్ జిల్లాలో 494మంది రైతులకు పత్తి డబ్బులు చెల్లించాల్సి ఉంది.

ఆధార్‌కార్డ్, బ్యాంకు బుక్ లింక్ లేకనే..

ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పోస్టాఫీస్ బుక్ అన్నీ అప్‌డేట్ చేసుకోకపోవడం, నిలిచిపోయిన బ్యాంక్ ఖాతా, వేలిముద్రలు, ఫొటో మ్యాచ్ కాకపోవడం తదితర సాంకేతిక కారణాల వల్ల కొందరు రైతులకు నగదు జమ కాలేదు. అప్‌డేట్ చేసుకోవాలని, పోస్టాఫీసు కార్యాలయంలో వివరాలు పొందుపర్చాలని సూచిస్తున్నాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీసీఐ కార్యాలయంలో సీసీఐ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నాం. నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– గజానంద్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల వ్యవసాయ మార్కెట్ అధికారి

మూడు నెలలైంది..



బెల్లంపల్లి మార్కెట్‌యార్డు పరిధిలోని రేపల్లివాడ జిన్నింగ్ మిల్లులో 39 క్వింటాళ్ల పత్తి రెండు నెలల క్రితం సీసీఐకి అమ్మినాం. రూ.1,77,606 రావాల్సి ఉంది. మూడు నెలలైనా పైసలు పడలేదు. ఆధార్‌కార్డు, పోస్టాఫీసు బుక్, బ్యాంకు ఖాతా బుక్ లింక్ చేశాం. మార్కెట్ అధికారులు మాపు పడుతాయని అంటున్నారు. – అన్నం రంగమ్మ, గ్రామం: బబాపూర్, మం: కన్నెపెల్లి

40 రోజులు అయింది..



పోయిన నెల 8న 40 క్వింటాళ్ల పత్తి సీసీఐకి అమ్ముకున్నా. నాణ్యత తక్కువగా ఉందని మద్దతు ధర కంటే రూ.100 తగ్గించారు. రూ.లక్షా 39 వేలు ఖాతాలో పడాల్సి ఉంది. 40 రోజులైనా ఇంతవరకు పడలేదు. అప్పుచేసి పంట సాగు చేసుడు అయింది. తెచ్చిన పైసలకు మిత్తి పెరిగిపోతాంది. ఆలస్యం చేయకుండా పైసలు వేయాలి. – మేకల పెద్దపోషం, గ్రామం: వీరపూర్, మం: కన్నెపల్లి

రెండు లక్షలు రావాలే..



పత్తి అమ్ముకునేటప్పుడు రాత్రీపగలు తేడా లేకుండా రెండు రోజులు అరిగోసపడుడు అయింది. రూ.2 లక్షలు పత్తి పైసలు రావాలే.. బ్యాంకు బుక్, ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్ జిరాక్స్, అన్ని కాగితాలు అప్పజెప్పినా.. పత్తి కొనేటప్పుడు వాళ్లు అడిగినట్లు అన్నీ అందించినా.. నెల రోజులు గడిచింది. ఇంతవరకు పైసలు ఆలస్యమే. – కారెం శంకర్, గ్రామం: పోలంపల్లి, మం: భీమిని

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఆర్కే 5 గనిపై జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వార్షిక నిర్దేశిత లక్ష్యాలను సాధించినందుకు గని ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న 24 భూగర్భ గనుల్లో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5, ఆర్కే 6 గనులు మాత్రమే వార్షిక నిర్దేశిత లక్ష్యాలను సాధించడం అభినందనీయమన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ రెండు గనులు నిర్దేశిత వార్షిక లక్ష్యాలను సాధించడంలో ముందు ఉన్నాయని పేర్కొన్నారు. రానున్న వార్షిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

రెండు బెల్ట్‌షాప్‌లపై దాడులు



మద్యం బాటిళ్లతో ఎస్సై పురుషోత్తం

జైనథ్: మండలంలోని గిమ్మ–కే, మేడిగూడ (ఆర్) గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌లపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు బుధవారం దాడులు చేసినట్లు సీఐ డి.సాయినాథ్, ఎస్సై పురుషోత్తం తెలిపారు. కాగా గిమ్మలో రూ.65వేల విలువ చేసే 96లీటర్ల మద్యం, మేడిగూడలో 25 వేల విలువ చేసే 50లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. గిమ్మ బెల్ట్‌షాప్ నిర్వహకుడు ముందస్తు సాయి, మేడిగూడ బెల్ట్‌షాప్ నిర్వహకుడు డోకే సంతోష్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉలఘించిన సహించేది లేదని, మద్యం అమ్మకాలు చేపట్టే వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు.

కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ సబ్‌స్టేషన్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై బుధవారం హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేశ్ వివరాల ప్రకారం.. 19వ తేదీన రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనంపై కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో వాహనాలు ధ్వంసం కాగా పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో గాయపడిన లక్సెట్టిపేట మండల గుల్లకోట గ్రామానికి చెందిన ఆవునూరి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్పీఎం క్వార్టర్‌లో దొంగతనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని న్యూకాలనీలో ఎస్పీఎం క్వార్టర్ నంబర్.సి 126లో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలతో పాటు బీరువా తాళాలు పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలతో పాటు రూ.10,500 నగదును దోచుకెళ్లారు. బుధవారం తెల్లవారు జామున ఇంటి యజమాని ఈర్ల సునీల్‌కుమార్ వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం

లక్సెట్టిపేట: పరిశుభ్రతే మానవాళి ప్రధాన లక్ష్యమని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా అన్నారు. బుధవారం మండలంలోని గోదావరి నది తీరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సేవ్ గోదావరి క్లీన్ గోదావరి కార్యక్రమంలో భాగంగా గోదావరి నది తీరంలో చెత్తను తొలగించి మాట్లాడారు. జీవనదులను కాపాడాలని కోరారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



సీసీ పుటేజ్‌లో రికార్డు అయిన చోరీ దృశ్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని భగత్‌సింగ్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి ప్రయత్నించాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించిన దొంగ ఏటీఎం మిషన్ ముందు భాగాన్ని తొలగించాడు. నగదు ఉండే మిషన్ సైతం ధ్వంసం చేసి నగదు అపహరించుకెళ్లాలని విఫలయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం సైరన్ వినిపించడంతో దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. అదే సమయంలో ఏటీఎం సెంటర్ల నిర్వహణను చూసే బ్యాంకు సిబ్బంది అప్రమత్తమై చోరీ యత్నం సమాచారాన్ని పోలీసులకు అందచేశారు. రెబ్బెన పెట్రోకార్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఏటీఎంను పరిశీలించారు. ఏటీఎం సెంటర్‌లోని సీసీటీవీ పుటేజ్‌ని పరిశీలించగా దొంగ ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించడంతో పాటు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసే సంఘటనలు రికార్డయ్యాయి. కైరిగూడ ఓసీపీ ఓబీ పనుల కోసం కొన్ని రోజుల క్రితం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యక్తి ఈ చోరీకి యత్నించినట్లు సీసీ పుటేజ్‌లో రికార్డు అయిన వీడియో ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానితుడి పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత

ఆసిఫాబాద్‌అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని బలియా గ్రామానికి చెందిన సంజన చౌబే అనే బాలిక తప్పిపోయి జిల్లాలోని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి కనిపించింది. సదరు బాలికను సఖీ కేంద్రంలో ఆశ్రయం కల్పించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహహింస, బాధిత బాలికలు, యువతులు, మహిళలకు సఖీ కేంద్రంలో ఆశ్రయం కల్పించి న్యాయ సేవలు అందించనున్నట్లు తెలిపారు. సిబ్బంది మమత, సుమలత, శ్రీనిధి, సంబంధిత అధికారులు ఉన్నారు.



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గోదాంలో చోరీకి పాల్పడిన ఐదుగురు అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్

భీమారం: మండల కేంద్రంలోని పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాంలో వడ్ల బస్తాల చోరీకి పాల్పడిన ఐదుగురిని బుధవారం అరెస్ట్ వేసి వారి వద్ద రెండు ఆటో ట్రాలీలతో పాటు రూ.59వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు శ్రీరాంపూర్ సీఐ మోహన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించాడు. మండల కేంద్రంలోని దుర్గ ఇండస్ట్రీస్‌కి చెందిన వడ్ల బస్తాలను గోదాంలో నిల్వ ఉంచారు. భీమారంకు చెందిన మల్లెత్తుల ప్రశాంత్, దాసరి చంద్రమౌళి, పందుల మధూకర్, బొంతల మధూకర్, మల్లెత్తుల రమేశ్‌లు కలిసి రాత్రి సమయాల్లో రెండు ట్రాలీలు తీసికెళ్లి గోదాం షెట్టర్ తాళాలు పగుల గొట్టి వడ్ల బస్తాలను దొంగిలించారు. అయితే గోదాంలో హమాలీ పనికి వెళ్లినప్పుడు దొంగతనం చేయాలనే ఆలోచన నిందితులకు వచ్చి దానిని అమలు చేశారు. రెండు నెలల నుంచి 78 బస్తాల వరకు చోరీకి పాల్పడ్డారని, ఈ ఐదుగురు కలిసి దొంగిలించిన బస్తాలను మహారాష్ట్రలో విక్రయించారు. ఈ నెల 16న గోదాంలో దొంగతనం చేసేందుకు వచ్చి ట్రాలీలో వడ్ల బస్తాలను వేసే క్రమంలో కొండయ్య అనే వ్యక్తి గమనించి యజమాని రమేశ్‌కు తెలుపడంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు నిందితులను పట్టుకున్నారు. ఈ సమావేశంలో ఎస్సైరాములు, ఏఎస్సై భూమన్న పాల్గొన్నారు.

‘కార్మికులను వేధిస్తున్న ఏఐటీయూసీ నాయకులు’



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రియాజ్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ నాయకులు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో విధులు నిర్వహిస్తున్న ఫీమేల్ జనరల్ మజ్దూర్ విషయంలో కొంతకాలంగా నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారనే విషయాన్ని ఆ గని అధికారులకు తెలియజేయడానికి వచ్చిన తనపై ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, కోటయ్య, కుమారస్వామి, శర్మ దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. ఆ ఫీమేల్ మజ్దూర్‌ను వారి యూనియన్‌లో చేరాలని ప్రతిరోజు ఏఐటీయూసీ నాయకులు వేధిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా మందమర్రి ఏరియాలో గుర్తింపు కార్మిక సంఘం పేరిట చాలా మంది ఏఐటీయూసీ నాయకులు ఫ్రీ మస్టర్లు పడి డ్యూటీలు చేయకుండా వెళ్తున్నారని, దీంతో సంస్థకు లక్షల్లో నష్టం వస్తుందని తెలిపారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్, తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం వాహనంతో ఎస్సై శ్రీధర్

జైపూర్: పెద్దపల్లి జిల్లా నుంచి సిరోంచకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జైపూర్ పోలీసులు మంగళవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. రాత్రి పెట్రోలింగ్ తనిఖీల్లో భాగంగా ఇందారం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించగా బోలెరో వాహనంలో 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రలోని సిర్వోంచకు తరలిస్తుండగా పట్టుకున్నట్లుగా ఎస్సై శ్రీధర్ తెలిపారు. పట్టబడిన వాహనాన్ని, బియ్యాన్ని పోలీస్‌స్టేషన్ తరలించినట్లుగా ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై అబీబ్, కానిస్టేబుల్స్ సురేశ్, సుబ్బారావు ఉన్నారు.

ప్రయాణికుడి ప్రాణం కాపాడిన జీఆర్‌పీ కానిస్టేబుల్



ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్న కానిస్టేబుళ్లు

మంచిర్యాలక్రైం: కదులుతున్న రైలు ఎక్కుతూ కింద పడిపోయిన ప్రయాణికుడి ప్రాణాలను కాపాడాడు జీఆర్‌పీ పోలీస్. వివరాల్లోకి వెళ్తే మహారాష్ట్రలోని గోందియ జిల్లా ఆదాసి గ్రామానికి చెందిన రూపేష్ బుధవారం మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. అప్పటికే ప్లాట్‌ఫాం నుంచి కదులుతున్న ట్రైన్‌ను ఎక్కేందుకు పరుగెత్తాడు. ఈ క్రమంలో ప్లాట్‌ఫాం, ట్రైన్‌కు మధ్యలో జారిపడిపోయాడు. వెంటనే విధి నిర్వహణలోని జీఆర్‌పీ కానిస్టేబుల్ నాగుల సురేందర్ చాకచక్యంగా స్పందించి పరుగెత్తి ప్రయాణికుడిని బయటకు లాగి ట్రైన్‌లోకి తోసేశాడు. ఈ ఘటనను గమనించిన ఓ ప్రయాణికుడు చైన్‌లాగడంతో రైలు నిలిపివేశాడు. టీసీ, కానిస్టేబుల్ సురేందర్ 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. కానిస్టేబుల్ కాపాడకపోయి ఉంటే ప్రయాణికుని కాలు తెలిపోయేదని స్థానికులు చెప్పడం గమనార్హం.

చేతికచ్చిన పంట నేల మట్టం



తిమ్మాపూర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట



దండేపల్లి: వెంకటాపూర్ వద్ద రోడ్డుపై పడిన చెట్టు

- జన్నారంలో వడగండ్ల వాన
- 15 ఎకరాల్లో పంట నష్టం

జన్నారం: జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వడగండ్ల వానతో చేతికచ్చిన మొక్కజొన్న పంట నేలమట్టమైంది. అనుకోకుండా కురిసిన వర్షంతో రైతులు ఉక్కిరిబిక్కిరయ్యారు. అరగంట పాటున కురిసిన వర్షంతో మండలంలో 15ఎకరాల వరకు మొక్కజొన్న పంట నష్టం వాటిల్లింది. జన్నారం మండలంలోని చింతగూడ, మహ్మదాబాద్, తిమ్మాపూర్, రాంపూర్, తపాలపూర్ గ్రామాల మీదుగా వర్షం పడింది. మిగతా ప్రాంతాలలో కేవలం గాలులు వీచాయి. ఈ వడగండ్ల వానతో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జునుగురి మల్లయ్యకు చెందిన 2 ఎకరాలు, కుక్కటికారి శంకర్ 4 ఎకరాలు, కామెర బానయ్య 2 ఎకరాలు జాడి ఆనందం ఎకరం, రాజన్న, పోశన్నలు రెండెకరాలలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. వీరితో పాటుగా తపాలపూర్, రాంపూర్ గ్రామాల్లో కూడా పంట దెబ్బతిన్నది.

గాలివాన బీభత్సం

దండేపల్లి: మండలంలో బుధవారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో పలుచోట్ల గాలికి చెట్లు విరిగిపడ్డాయి. యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట దెబ్బతింది. మండలంలోని మేదరిపేట, చింతపల్లి, తాళ్లపేట వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో సుమారుగా 250కి పైగా ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలవాలి నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

నస్పూర్ వాసికి ఉత్తమ పౌర సేవ పురస్కారం



పురస్కారం అందిస్తున్న హుస్సేన్, ఎస్సై

నస్పూర్: పట్టణ పరిధిలోని సృష్టి ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ అంబాల రాజ్‌కుమార్ విద్యారంగంలో చేస్తున్న సేవలకు ఆయనకు హ్యూమన్ రైట్స్ సోషల్ సర్వీస్ అండ్ సోషల్ జస్టిస్ చేంజ్ ఫర్ ఇండియా సభ్యులు ఉత్తమ పౌర సేవ పురస్కారాన్ని అందజేశారు. బుధవారం సీసీసీ కార్నర్‌లోని సృష్టి ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సోషల్ సర్వీస్ అండ్ సోషల్ చేంజ్ ఫర్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మంగళంపల్లి హుస్సేన్, సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ పురస్కారాన్ని రాజ్‌కుమార్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గోదారి వెంకటసాయి, స్టేట్ కమిటీ మెంబర్ ప్రభాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాయిని స్వామి, జిల్లా జనరల్ సెక్రటరీ సాయికుమార్, ట్రస్మా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.